సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 21, అక్టోబర్, 2024



అప్పన్నకు స్వర్ణపుష్పార్చన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి 108 స్వర్ణ సంపెంగలతో పుష్పార్చన విశేషంగా జరిగింది.



సాగరతీరంలో సండే సందడి

విశాఖ నగరంలో సాగరతీరం కిటకిటలాడింది. పిల్లపాపలతో కలసి నగర వాసులు ఆర్‌కే బీచ్‌కు తరలివచ్చి ఆనందంగా గడిపారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

పరవశించిన పర్యాటకం



బొర్రాగుహలను సందర్శించిన పర్యాటకులు



ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: మన్యంలో పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో సందడిగా మారాయి. అనంతగిరిలోని బొర్రాగుహలు, కటికి జలపాతం, అరకులోయ ఘాట్, సుంకరమెట్ట కాఫీతోటలు, అరకులోయ గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, రణజిల్లెడ, చాపరాయి, కొత్తపల్లి జలపాతాల సందర్శనకు భారీగా తరలివచ్చారు.

వరుణుడు కరుణించాలని పూజలు

రాజవొమ్మంగి: వరుణుడు కరుణించి వర్షాలు కురవాలంటూ మండలంలోని బడదనాంపల్లి గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామ దేవత గంగాలమ్మ గుడి వద్ద అమ్మవారిని పూలతో అలంకరించారు. వాగు నుంచి కడవలతో నీళ్లను తీసుకువచ్చి పసుపు కలిపి గ్రామ శివారులో రహదారిపై పోశారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు.

చెరువులవేనంకు తాకిడి



చెరువులవేనంలో పర్యాటకులు

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో పర్యాటకులు సందడి నెలకొంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి పర్యాటకుల రాకతో ఈ ప్రాంతం కళకళలాడింది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. లంబసింగి జంక్షన్, తాజంగి జలాశయం ప్రాంతాల్లో సందడి నెలకొంది.

అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకించారు.



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

అప్పన్నను దర్శించుకున్న సినీ నటి లయ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం సినీ నటి లయ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ ప్రసాద్ అందజేశారు.

విశాఖ- రాయపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల కోరిక మేరకు విశాఖపట్నం-రాయ్‌పూర్ పాసింజర్ వేళల్లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మారిన వేళలు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. విశాఖపట్నం-రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ప్రతి రోజూ ఉదయం 6.30 గంటలకు బదులుగా ఉదయం 4.25 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. ప్రతి రోజూ రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

జీసీసీ పునరాలోచించాలి



సేంద్రియ విధానంలో పండించే కాఫీకి గతేడాది ప్రైవేట్ వ్యాపారులు మంచి రేటు చెల్లించారు. పార్చిమెంట్‌కు రూ.300లోపు, చెర్రీ రూ.150, రొబస్టా రూ.110 చొప్పున ధర లభించింది. దీంతో ఈ ఏడాది జీసీసీ ప్రకటించిన ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావు. కేవలం గతేడాది జీసీసీ చెల్లించిన ధరను పరిశీలిస్తే ఈ ఏడాది కేవలం రూ.5 మాత్రమే పెంచింది. ఈ ధరలకు ప్రైవేట్ వ్యాపారులు చెల్లించే ధరకు రూ.80 నుంచి రూ.40 వ్యత్యాసం ఉంటోంది. ఇందుకు అనుగుణంగా జీసీసీ ధర పెంచితే బాగుంటుంది.

– బొండు వెంకటేష్, అభ్యుదయ రైతు, గొందిపాకలు, చింతపల్లి మండలం

మంచి ధర ఇవ్వకే ప్రైవేట్‌కు విక్రయాలు



గిరిజన రైతులు నష్టపోకుండా ఉండేలా జీసీసీ, ఐటీడీఏలు మద్దతు ధర ప్రకటించాలి. అవి చెల్లించే ధరలు గిట్టుబాటు కానందునే ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఏటా ప్రైవేట్ వ్యాపారులు చెల్లించే ధరలు కంటే ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు తక్కువగానే ఉంటున్నాయి. జీసీసీ ప్రకటించిన ధరను పెంచడంతో పాటు ఐటీడీఏ ప్రకటించనున్న కాఫీ పండ్ల ధరను కూడా కిలో రూ.50కు పైబడి ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– గెమ్మిలి నాయుడు, కాఫీ రైతు, దిగువపాకలు, చింతపల్లి మండలం

పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏలను కాఫీ రైతులు కోరుతున్నారు. ఇప్పటికే జీసీసీ ధర ప్రకటించగా, పాడేరు ఐటీడీఏ పండ్ల కొనుగోలు ధరను ప్రకటించాల్సి ఉంది. ఇవి చెల్లించే ధరలు ప్రైవేట్ వ్యాపారులు చెల్లించే దానితో పోలిస్తే వ్యత్యాసం ఉన్నందున ఈ విషయంలో పునరాలోచించాలని కాఫీ రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధరపై దయ చూపండి

జీసీసీ, ఐటీడీఏకు కాఫీ రైతుల విన్నపం



- ఇప్పటికే ధర ప్రకటించిన గిరిజన సహకార సంస్థ
- గిట్టుబాటు కానందున మరోసారి పునరాలోచించాలంటున్న గిరి రైతులు
- కొద్ది రోజుల్లో పాడేరు ఐటీడీఏ కూడా ప్రకటించే అవకాశం
- సవరిస్తారన్న ఆశతో ఎదురుచూపు



చింతపల్లి: పాడేరు డివిజన్‌లో 2.20 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. వీటిలో 1.48 లక్షల ఎకరాలు ఫలసాయం ఇస్తున్నాయి. మొత్తంమీద సుమారు 17 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తోంది. ఈ ఏడాది పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, హుకుంపేట, అరకు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. చింతపల్లి, గూడెంకొత్తవీధి ప్రాంతాల్లో దిగుబడి తగ్గే అవకాశం కనిపిస్తోంది.

➠ ఏటా రైతుల నుంచి పార్చిమెంట్, చెర్రీ, రొబస్టాను గిరిజన సహకార సంస్థ, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో చింతపల్లి మ్యాక్ సంస్థ కేవలం కాఫీ పండ్లను మాత్రమే కొనుగోలు చేస్తోంది. ఇవికాకుండా మరో ఎనిమిది రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా వ్యాపార రూపంలో సేకరిస్తున్నాయి.

నాణ్యమైన కాఫీ గింజల సేకరణ లక్ష్యం

ఈ ఏడాది నాణ్యమైన కాఫీని సేకరించాలని గిరిజన సహకార సంస్థ నిర్ణయించింది. దీనిలో భాగంగా కాఫీ రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇందుకు సంబంధించి పాడేరు డివిజన్‌లో 633, చింతపల్లి డివిజన్‌లో 160 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు గిరిజన సహకార సంస్థ పేర్కొంది.

ధరలు గిట్టుబాటు కావడం లేదు



ఎంతో కష్టబడి సేంద్రియ విధానంలో కాఫీని పండిస్తున్నాం. అందుకు తగ్గట్టుగా గిట్టుబాటు ధరలు ప్రకటించడం లేదు. మొదటి మూడు దఫాల్లో సేకరించిన కాఫీ పండ్లు మాత్రమే పూర్తిస్థాయి గింజతో పార్చిమెంట్ కాఫీకి ఉపయోగపడుతుంది. తదుపరి సేకరించిన పండ్లు నాణ్యత లేకపోవడంతో చెర్రీకి అనుకున్నంత ధర వచ్చే అవకాశం లేదు. పండ్ల సేకరణకు రోజుకు 200, 250 చొప్పున కూలిధరలు చెల్లించాల్సి వస్తోంది.

– లాకరి వెంకట రమణ, ఆదర్శ రైతు, అసరాడ, చింతపల్లి మండలం

మంచి ధర ప్రకటనకు అవకాశం



కాఫీ సాగు చేస్తున్న గిరి రైతులు ఆశించినట్టుగానే మంచి మద్దతు ధర ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే జీసీసీ కాఫీ ధరలను ప్రకటించడంతో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ కమిటీతో చర్చించి త్వరలోనే కాఫీ పండ్ల కొనుగోలు ధరను ప్రకటించే అవకాశం ఉంది. రైతులకు బోనస్ ఇప్పటికే ప్రకటించారు. ఈ ఏడాది రెండు వేల టన్నుల నాణ్యమైన కాఫీ పండ్లను సేకరణే లక్ష్యంగా నిర్ణయించాం. త్వరలోనే ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ధర ప్రకటిస్తారు.

– ఎస్.అశోక్, ఏడీ కాఫీ విభాగం, ఐటీడీఏ పాడేరు.

నాణ్యమైన ఉత్పత్తుల సేకరణ లక్ష్యం



మంచి నాణ్యత గల కాఫీ పంట ఉత్పత్తులను సేకరించే లక్ష్యంతో గిరి రైతులకు అవగాహన కలిప్తున్నాం. ముందుగానే కాఫీ ధరలను జీసీసీ యాజమాన్యం ప్రకటించింది. ఈ ఏడాది పాడేరు డివిజన్ పరిధిలోని ఆరు సొసైటీల్లో 1354, చింతపల్లి డివిజన్ మూడు సొసైటీల పరిధిలో 650 టన్నుల సేకరణ లక్ష్యంగా నిర్ణయించింది. వచ్చేనెల రెండో వారం నుంచి పాడేరు డివిజన్‌లో, డిసెంబర్ నుంచి చింతపల్లి డివిజన్‌లో సేకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– దేవరాజు, డీఎం, జీసీసీ, పాడేరు

మృతురాలి ఊహాచిత్రం విడుదల.. పోలికలు గుర్తిస్తే సంప్రదించండి

- అడ్డతీగల సీఐ నర్సింహరావు వెల్లడి



పోలీసులు విడుదల చేసిన ఊహా చిత్రం

అడ్డతీగల: మండలంలోని తిమ్మాపురం వద్ద ఏలేరు వాగులో లభ్యమైన తల, కాళ్లు, చేతులు లేకుండా గుర్తించిన మహిళ మొండెంకు సంబంధించిన ఊహాచిత్రాన్ని పోలీసులు విడుదల చేశారు. ఈ మృతదేహాన్ని గత ఆగస్టు 17న స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పసుపు రంగు లంగా లభ్యం కావడంతో మహిళగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. అయినప్పటికీ ఆమెకు సంబంధించి ఎటువంటి సమాచారం లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో చనిపోయిన మహిళ ఊహా చిత్రాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో వేయించామని స్థానిక సీఐ నర్సింహరావు వెల్లడించారు. ఆమె వయస్సు 25 నుంచి 30 ఏళ్లు ఉండవచ్చన్నారు. ఈ ఊహా చిత్రంలో పోలికలు ఆధారంగా మహిళను గుర్తిస్తే వెంటనే అడ్డతీగల ఎస్ఐ 9440900769, తనను 9440900768 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



తాజంగి జలాశయంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు బోటు షికారు

చింతపల్లి: మండలంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని లంబసింగి, తాజంగి పంచాయతీల్లో పర్యటించారు. లంబసింగి ఘాట్‌రోడ్డులోని చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ప్రకృతి అందాలను తిలకించారు. తాజంగి జలాశయం వద్ద బోటులో షికారు చేశారు. ఇదే ప్రాంతంలో మరికొన్ని బోట్లు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంటన జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, కిటుముల సర్పంచ్ రమణమ్మ, మాజీ ఎంపీపీ బాబూరావు,మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బాలిక ఉన్నత వైద్యానికి తరలింపు

- నిరాకరించిన తల్లికి పీవో అభిషేక్ ఫోన్లో కౌన్సెలింగ్
- ఆయన హామీతో అంగీకరించిన మాతృ హృదయం



బాలికను పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ ప్రభావతి

చింతపల్లి: తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను ఎట్టకేలకు పాడేరు ఐటీడీఏ పీవో చొరవతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. జీకేవీధి మండలం వంచుల పంచాయతీ ఏబులం కొడిసింగికి చెందిన కొర్ర రిబక రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన ఆమె శుక్రవారం తిరిగి వచ్చింది. అదే రోజు సాయంత్రం, మరుసటిరోజు ఉదయం వాంతులు కావడంతో ఏఎన్ఎం మందులిచ్చింది. అప్పటికి తగ్గకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సూపరింటెండెంట్ ప్రభావతి వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరుకుంది. దీంతో బాలికను ఉన్నత వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించాలని ఆమె సూచించారు. ఇందుకు బాలిక తల్లి సునీత నిరాకరించింది. వారం రోజుల క్రితం తన భర్తకు విశాఖలో ఆపరేషన్ జరిగినా బతకలేదని, అక్కడ అంతా డబ్బులతో పని అని.. నా బిడ్డను అక్కడికి తీసుకువెళ్లి ఇబ్బందులు పడలేనని వాపోయింది. ఇంటికి తీసుకుపోయి పసర మందులతో నయం చేసుకుంటానని భీష్మించింది. దీంతో ఆమెకు పాఠశాల ఉపాధ్యాయులు, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి నచ్చజెప్పారు. అయినప్పటికీ ఆమె వినకపోవడంతో విషయాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఫోన్లో బాలిక తల్లి, గ్రామ పెద్దలతో మాట్లాడారు.విశాఖ కేజీహెచ్‌లో ఏ సమస్య రాకుండా తానే స్వయంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో బాలికను కేజీహెచ్‌కు తరలించారు.

ప్రాణాలను బలిగొన్న పిడుగులు



మండపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు



మండపల్లిలో మృతి చెందిన వృద్ధురాలు బొర్రమ్మ

వృద్ధురాలు, పాడి పశువులు మృతి

కొయ్యూరు: మండలంలో పిడుగుల శబ్దానికి వృద్ధురాలి గుండె ఆగిపోగా, పాడి గేదెలు, మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఎం.భీమవరం పంచాయతీ మండపల్లిలో ఇంటి వద్ద ఉన్న కాకూరి బొర్రమ్మ(70) అనే వృద్ధురాలు పిడుగుల శబ్దానికి భయపడింది. దద్దరిల్లడంతో ఆమె గుండె ఆగి మరణించిందని గ్రామస్తులు తెలిపారు. ఇదే గ్రామానికి సమీపంలో మేస్తున్న పశువులపై పిడుగులు పడ్డాయి. దీంతో 15 పశువులు,మేక అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్షల మేర నష్టం వాటిల్లింది. గ్రామంలో కాపూరి మూర్తికి చెందిన మూడు పశువులు,పెంటయ్యకు చెందిన రెండు, జర్త లక్ష్మయ్యకు చెందిన ఒకటి, జర్త బాలరాజుకు చెందిన మూడు,పలాసి చలపతికి చెందిన రెండు,కాకూరి రాంబాబుకు చెందిన ఒకటి,జర్త సుందరరావు,రామాంజులకు చెందిన ఒక్కో పశువు మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. జర్త అర్జునరావుకు చెందిన మేక ప్రాణాలు కోల్పోయింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

చిట్టంరాయి సమీపంలో..

పెదబయలు:మండలంలోని సీకరి పంచాయతీ చిట్టంరాయి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంతో పశువుల మందపై ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడింది. ఈ ఘటనలో పలాసి మాధవరావుకు చెందిన రెండు ఎద్దులు, పలాసి కేశవరావు చెందిన ఆవు మృతి చెందాయి. ఇదే ప్రాంతంలో పశువులు కాస్తున్న వంతాల అజయ్‌కుమార్ ధ్వని స్పర్శ కోల్పోయినట్టు స్థానికులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు కోరారు.

మంచు వాన



వాతావరణ మార్పుల నేపథ్యంలో పాడేరు ఘాట్ రోడ్డులో ఆదివారం ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మినుములూరు కాఫీ తోటలు ప్రాంతం నుంచి 12వ మైలురాయి గ్రామం వరకు రోజంతా మంచు వాన కురిసింది. సాధారణంగా ఈ ప్రాంతం చల్లగా ఉంటుంది. అడపా దడపా వర్షాల నేపథ్యంలో వాన చినుకులు మాదిరిగా కురుస్తున్న మంచు కనువిందు చేసింది. ఈ భిన్న వాతావరణాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు. – సాక్షి, పాడేరు

మరో మేఘాల కొండ



మన్యంలో మరో మేఘాల కొండ వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు పాడేరు మండలంలో వంజంగి హిల్స్, వల్లాయి ప్రాంతాల్లో మంచు, మేఘాల అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇప్పుడు మండలంలోని గసభ పంచాయతీ మొర్రిగుడలో కొండ ప్రాంతంలో ప్రకృతి అందాలు వాటిని తలపిస్తున్నాయి. ఇక్కడికి చేరుకునేందుకు రోడ్డు సౌకర్యం ఉంది. ఈ ప్రాంతానికి పది కిలోమీటర్ల దూరంలో కొల్లాపుట్టులోని ఐటీడీఏ కాటేజీలు అందుబాటులో ఉన్నాయి. – డుంబ్రిగుడ

ఘనంగా సత్యసాయి అవతరణ దినోత్సవం

పాడేరులో 14 కిలోమీటర్ల మేర నగర సంకీర్తన



సత్యసాయి చిత్రపటంతో నగర సంకీర్తన



మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

సాక్షి,పాడేరు: భగవాన్ సత్యసాయిబాబా అవతరణ దినోత్సవాన్ని ఆదివారం పాడేరు, హుకుంపేట మండలాల్లో సత్యసాయి సేవా సమితి ఘనంగా నిర్వహించింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నగర సంకీర్తనను ప్రారంభించింది. పాడేరు పురవీధుల్లో నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు సాయిబాబా చిత్రపటాన్ని దర్శించుకున్నారు. తలారిసింగి, చింతలవీధి, బర్మన్‌గుడ, హుకుంపేట మీదుగా గడుగుపల్లిలోని సత్యసాయి గిరిజన సేవా మందిరం వరకు 14కిలోమీటర్ల పాడవున సాగింది. సుమారు 2,500 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి మందిరంలో భక్తులు ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులకు పాడేరులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, సత్యసాయి సేవా ట్రస్ట్ ప్రతినిధులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సంస్థల ఆర్గనైజింగ్ ప్రతినిధులు గణేష్, సుబ్బారావు, ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్యాత్మిక విభాగం సభ్యులు ఉప్పల వెంకటరత్నం, కిములు ప్రభాకర్, సిద్ధనాతి కొండలరావు, పారుపల్లి నాగేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుట్టపర్తికి మాడుగుల హల్వా



మాడుగుల హల్వాను ప్రత్యేక వాహనంలో పుట్టపర్తికి తీసుకు వెళ్తున్న భక్తులు

మాడుగుల: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న పర్తియాత్రలో పాల్గొనున్న సత్యసాయిబాబా భక్తులకు మాడుగుల హల్వాను ప్రసాదంగా అందజేయనున్నారు. ఈమేరకు స్థానిక భక్తులు హల్వాతో ఆదివారం పుట్టపర్తికి పయనమయ్యారు. సాయి గాయత్రీ పారాయణం చేస్తూ ప్రత్యేక వాహనంలో హల్వాను తీసుకుని స్థానిక భక్తులు బయలుదేరారు.

నేడు మహిళా కళాశాలలో జాబ్‌మేళా

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. జాబ్‌మేళాలో తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్ ఇన్సోర్స్, ఎస్‌బీఐ కార్డ్స్, డీమార్ట్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9966965502 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

యలమంచిలి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాల గడువు పొడిగించాలని అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ నాగేశ్వరరావు ముగిసిన గడువును ఈ నెల 31 వరకూ పొడిగించినట్టు పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 31 తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రాల ద్వారా గానీ, ఎంఈవో కార్యాలయాల ద్వారా గానీ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ద్వారా గానీ, సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చునని ఆమె పేర్కొన్నారు.

ఓపెన్ విద్య.. అంతా మిథ్య

ప్రైవేటు స్టడీ సెంటర్ మంజూరు కోసమని లంచం తీసుకుంటూ అనకాపల్లి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్‌ను ఏసీబీ అధికారులు ఇటీవల రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సార్వత్రిక విద్యలో జరుగుతున్న అక్రమాలకు ఈ ఉదంతం ఓ ఉదాహరణ.

నగరంలో శ్రీనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీకి ఇంటర్ బోర్డు నుంచి గుర్తింపు లేదు. అయితే ఈ కాలేజీ కోడ్‌తో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు తీసుకున్నారు. విషయం ఆలస్యంగా తెలుసుకున్న విద్యాశాఖాధికారులు.. దీన్ని ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. కానీ సప్లిమెంటరీ పరీక్షలకు ఆ కాలేజీ పేరుతో విద్యార్థులు హాజరవుతుండటం గమనార్హం.

ఇదీ జిల్లాలో సార్వత్రిక విద్యా విధానం అమలు పరిస్థితి..



విశాఖలోని ఓ స్టడీ సెంటర్‌లో తరగతులకు హాజరైన విద్యార్థులు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 80 స్టడీ సెంటర్లు
- ఏటా ఐదు వేల మందికి పైగా విద్యార్థులు చేరిక
- పాస్ గ్యారెంటీ పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు
- గుర్తింపు లేని కేంద్రాల్లోనూ అడ్మిషన్లు
- ఏసీబీ ట్రాప్‌తో బాగోతం బట్టబయలు

విశాఖ విద్య: అనివార్య కారణాలతో చదువులు మధ్యలోనే ఆపేసిన వారు 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ ఏర్పాటు చేసింది. గుర్తింపు పొందిన స్టడీ సెంటర్ల ద్వారా ఏటా ప్రవేశాలు కల్పించి వార్షిక పరీక్షలు నిర్వహిస్తోంది. రెగ్యులర్ కోర్సులతో సమాన గుర్తింపు ఉండటంతో ఓపెన్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. విశాఖ జిల్లాలో 17, అనకాపల్లిలో 33, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 30 స్టడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఏటా ఐదు వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతుండగా, అనకాపల్లి జిల్లా నుంచే ఎక్కువ మంది చేరుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో జిల్లాలో 19 ప్రైవేట్ సెంటర్లు నిర్వహిస్తున్నారు.

తరగతుల నిర్వహణపై శ్రద్ధ ఏదీ?

ఓపెన్ స్కూల్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఫోకస్ పెట్టారు. స్టడీ సెంటర్ల నిర్వాహకుల పెత్తనాన్ని తగ్గించేలా ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చారు. పాఠ్య పుస్తకాలను సకాలంలో నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా పంపించి, తరగతుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. కానీ ఈ ఏడాది తరగతుల నిర్వహణ సవ్యంగా సాగడం లేదు. 2024–25 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యా విధానంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. పలు దఫాలు గడువు పెంచిన అధికారులు.. చివరి అవకాశం అంటూ ఈ నెల 25 వరకు ప్రవేశాలు పొందవచ్చని ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూల్ మేరకు 30 తరగతులు నిర్వహించాలి. కానీ ఇప్పటికే చేరిన వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అడిగినంత ఇవ్వాల్సిందే..

ఓపెన్ స్కూల్స్‌లో ఇంటర్మీడియెట్‌కు జనరల్ కేటగిరీ వారైతే రూ.1,400, రిజర్వేషన్ అభ్యర్థులకు రూ.1,100లు ఫీజుగా చెల్లించాలి. టెన్త్‌కు జనరల్ వారికి రూ.1,300, రిజర్వేషన్ ఉన్న వారు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశం పొందే అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లించవచ్చు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు ఈ కోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. దీంతో కొన్ని ప్రైవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులకు పాస్ గ్యారెంటీ పేరుతో నిర్దేశిత ఫీజు కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. గత వార్షిక పరీక్షల సమయంలో విశాఖ జిల్లాలోని భీమునిపట్నం కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ స్క్వాడ్ టీమ్‌కు పట్టుబడటం ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది.

తరగతుల నిర్వహణపై దృష్టి

షెడ్యూల్ మేరకు తరగతులు నిర్వహించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పుస్తకాలు నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా చేరుతాయి. సర్టిఫికెట్లు కూడా విద్యార్థుల ఇంటి చిరునా మాకు పంపిస్తున్నాం.

–మురళీమోహన్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, విశాఖ జిల్లా

నిలిచిన నైట్ సర్వీసులు.. ప్రయాణికుల ఇక్కట్లు

పునరుద్ధరణకు నోచుకోని విశాఖ– భద్రాచలం నైట్ సర్వీసు



ప్రస్తుతం నడుపుతున్న పగటిపూట బస్సు

సీలేరు: గత నెల 8న కురిసిన భారీ వర్షాలకు అల్లూరి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. దీంతో పలు ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి. జి.కె.వీధి నుంచి సీలేరు రహదారిని కొండపై నుంచి జారిపడిన చెట్లను రాళ్లను తొలగించి ఆర్‌ఎండ్‌బీ అధికారులు తాత్కాలికంగా బాగుచేశారు. తొలుత చిన్న తరహా వాహనాల రాకపోకలకు అనుమతినిచ్చారు. లంకపాకల వద్ద వంతెనకు మరమ్మతులు చేసి ప్రస్తుతం బస్సులు రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపట్టారు. అయితే నైట్ సర్వీసులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు నైట్ సర్వీ సు బస్సులు అనుకూలంగా ఉండేదని, ఇప్పుడు పగ టి పూట ఒకటే సర్వీసు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నైట్ హాల్ట్ సర్వీసులను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

నైట్ సర్వీసులు నడపండి



నేను పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేస్తున్నాను. పాఠశాల పనుల నిమిత్తం విశాఖపట్నం వెళ్లేందుకు నైట్ బస్సు సర్వీసు ఎంతో అనుకూలంగా ఉండేది. కాని ప్రస్తుతం సర్వీసు లేక విశాఖలో జరిగే పాఠశాల అత్యవసర సమావేశాలకు వెళ్లలేకపోతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నైట్ బస్సులు నడపాలి.

– శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

భక్తులకు అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం, పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయంలో ఉచిత ప్రసాదాలు, మధ్యాహ్నం భోజన కార్యక్రమాలను ఆలయ కమిటీ విజయవంతంగా నిర్వహిస్తుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, సభ్యులంతా భక్తుల సహకారంతో మోదమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు మైదాన ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు.వారందరికి ఉదయం ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి భక్తుడు డోకుపర్తి మూర్తి ఆర్థిక సాయమందించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానికులతో పాటు మైదాన ప్రాంత భక్తులు తదితరు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు చెప్పారు.

29 నుంచి ఆరోగ్య మిత్రల నిరవధిక సమ్మె



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్య శ్రీ) పథకం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదరోగులకు సేవలు అందిస్తున్న ఫీల్డ్ సిబ్బందికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈనెల 29 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న గుంటూరులో ఎన్టీఆర్ వైద్యసేవ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషాకు రాష్ట్ర నాయకులు సమ్మె నోటీస్ ఇచ్చారని చెప్పారు. ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానటిరింగ్‌కేడర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మె చేసేందుకు సిద్ధమైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కనకం, సంఘం గౌరవాధ్యక్షుడు వై. ఎస్.భద్రం, జిల్లా నాయకులు సోమేష్, దుర్గాప్రసాద్, మూర్తి, రమణి, శంకర్, కరుణ, రత్నకుమారి, జయమని, ప్రసాద్ పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్.. కేరాఫ్ కంచరపాలెం

- ఒంటరి మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలు
- శ్రీకాకుళంలో చోరీ చేసి మెరుపు వేగంతో విశాఖకు పరారీ
- రాష్ట్ర వ్యాప్తంగా 30 చోరీల్లో కీలక నిందితుడు
- 8.5 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటాడు.. ఆమె పక్క నుంచే బైక్ పోనిచ్చి.. రన్నింగ్‌లోనే మెడలో చైన్‌లు తెంపేస్తాడు.. మరుక్షణమే 100 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ఘటనాస్థలి నుంచి చెక్కేస్తాడు.. ఇదీ విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన భీమరశెట్టి కమల్‌నాథ్ చైన్‌స్నాచింగ్ తీరు. రాష్ట్ర వ్యాప్తంగా 30 చోరీల్లో కీలక నిందితుడైన అతడు పదిసార్లు కటకటాల్లో మగ్గాడు. విడుదలైన వారం రోజుల్లోనే మూడు జిల్లాల్లో నాలుగు చోరీలు చేసి శ్రీకాకుళం పోలీసులకు చిక్కాడు. శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే..

చోరీలివే.. : కమల్‌నాథ్ 2023 ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు విషయంలో అరెస్టయ్యి 11 నెలలు విశాఖపట్నం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవించి ఈ ఏడాది అక్టోబర్ 4న విడుదలయ్యాడు. అక్టోబరు 6న తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల మధ్య స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో మంగళ సూత్రం (16.6 గ్రాములు) తెంచేశాడు. అదేరోజు బిక్కవోలులో రోడ్డు వెంబడి నడుస్తున్న మహిళ మెడలో చైన్(రోల్డ్ గోల్డ్) చోరీ చేశాడు. అదే రోజు విజయనగరం జిల్లా డెంకాడ పీఎస్ పరిధి రఘుమండ గ్రామ కూడలి వైఎస్సార్‌కాలనీ వద్ద ద్విచక్రవాహనంపై వెనుక కూర్చుని ఉన్న మహిళ మెడలో రెండున్నర తులాల పుస్తెల తాడు తెంచి పరారయ్యాడు. అది కూడా రోల్డ్ గోల్డ్ కావడం గమనార్హం. అక్టోబరు 11న అరసవల్లి దేవాలయం వైపు వెళ్లి స్కూటీపై ఒంటరిగా వస్తున్న మహిళ మెడలో నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల తాడు తెంచి పరారయ్యాడు.

చోరీ సొత్తు ఏం చేశాడంటే.. : దొరికిన చోరీ సొత్తును విశాఖలోని మురళీనగర్‌లో ముత్తూట్ ఫైనాన్స్, కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో కమల్‌నాథ్ తండ్రి భీమరశెట్టి శ్రీరామమూర్తి పేరు మీద తాకట్టు పెట్టాడు. వచ్చిన సొమ్మును తండ్రీకొడుకులిద్దరూ పంచుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, వెనుక నిందితుడితో వన్‌టౌన్ పోలీసులు

వ్యసనాలకు బానిసై..

కమల్‌నాథ్ ఏడో తరగతి వరకే చదివి మధ్యలో ఆపేసి వ్యసనాలకు బానిసయ్యాడు. తండ్రికి మెకానిక్ షాపుండటంతో అక్కడే పనిచేసుకుంటూ తాళాలు లేకుండా వాహనాలు తీయడం నేర్చాడు. 2009 నుంచి బైక్‌లు, మహిళల మెడలో చైన్లు, ఆభరణాలు దొంగిలించేవాడు. ఈ క్రమంలో మొదటిసారి సామర్లకోట రైల్వే స్టేషన్ దగ్గర బైక్ దొంగిలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అరెస్టయి బయటకొచ్చాక మరిన్ని చైన్‌స్నాచింగ్‌లు చేశాడు.

ఎక్కడెక్కడ చేశాడంటే..

కంచరపాలెం, అనకాపల్లి, విజయనగరం టూటౌన్, శ్రీకాకుళం రూరల్, జామి, కొత్తవలస, ఆరిలోవ, అనపర్తి, ఎచ్చెర్ల, ఎయిర్‌పోర్టు, సబ్బవరం, గోపాలపట్నం పీఎస్‌ల పరిధిలో చోరీలు చేయగా 30 కేసులు నమోదయ్యాయి. ఇందులో పదిసార్లు నేరం రుజువై జైలుకెళ్లాడు.

జోనల్ స్థాయి పోటీలకు తెనుగుపూడి విద్యార్థులు



ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో ప్రతిభ చూపిన తెనుగుపూడి గురుకుల విద్యార్థులు

దేవరాపల్లి: జిల్లా స్థాయి సైన్స్, ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో సత్తాచాటి జోనల్ స్థాయి పోటీలకు తెనుగుపూడి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కొక్కిరాపల్లిలోని బాలికల గురుకుల విద్యాలయంలో ఈనెల 18న జిల్లా స్థాయి సైన్స్, ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో ఆర్ట్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెనుగుపూడి విద్యార్థులు ప్రతిభచూపారు. సీనియర్స్ ఆర్ట్స్ విభాగంలో ఇంటర్ ఫస్ట్ యర్ విద్యార్థి కె.ప్రవీణ్, టెన్త్ విద్యార్థి కె.సుధీర్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ ఇద్దరికి ఉమ్మడి విశాఖ గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు జి.అర్జునరావును డీసీవో రూపావతి, స్థానిక గురుకుల ప్రిన్సిపల్ పి.రఘు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇరటా నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

ఇరువర్గాల వివాదంలో ఐదుగురిపై కేసు

మాకవరపాలెం: రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంలో ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జి.కోడూరుకు చెందిన శానాపతి శేషు, చవ్వాకుల శ్రీనుకు లారీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి మధ్య నర్సీపట్నం లారీ యార్డులో ఇటీవల గొడవ జరిగింది. మళ్లీ శుక్రవారం జి.కోడూరులో జరిగిన వివాదంలో చవ్వాకుల శ్రీను, వీరబాబు తమపై దాడి చేశారంటూ శానాపతి శేషు, సకిరెడ్డి నానాజీ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం శ్రీను, వీరబాబుపై శేషు, మరికొందరు దాడి చేశారని శ్రీను ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాలకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మంత్రి దృష్టికి సమస్యలు



గిరిజనుల సమస్యలను మంత్రి సంధ్యారాణికి వివరిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, నాయకులు

అనంతగిరి(అరకులోయ రూరల్): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి అనంతగిరి మండల సమస్యలను జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, నాయకులు తెలియజేశారు. సాలూరులో నివాసమున్న మంత్రిని వారు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శివారు గ్రామంలో రహదారి, సౌకర్యం లేక అత్యవసర సేవలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం 108,104 అంబులెన్స్ వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గర్భిణులు, రోగులను డోలిమోతలతో తరలించే పరిస్థితి ఉందని ఆమె దృష్టిలో తీసుకెళ్లినట్టు ఆయన చెప్పారు. మండలంలో పాతకోటలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి స్థానిక గిరిజన కుటుంబాలు తమ భూములిస్తే వారి కుటుంబాలను ఉపాధి ఆకాశం లేకుండా చేశారన్నారు. ఆయా భూములిచ్చిన కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని గతంలో కలెక్టర్, ఐటీడీపీవోలు హామీ ఇచ్చి నేటికీ అమలుచేయలేదన్నారు. తక్షణమే భూదాత కుటుంబాలకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఎగువశోభ పంచాయతీ మర్దగుడ నుంచి జాముగుడ వరకు, లంగుపార్తి పంచాయతీ ఒనుగుకొండ నుంచి గడిబంద పినకోట వరకు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు. గ్రామల్లో తాగునీరు, డ్రైనేజీలు, చెక్‌డ్యాంలు, అవసరమైన చోట మినీ రిజర్వేలు ఏర్పాటు చేయాలని, అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు, హౌసింగ్ గృహలు మంజురు చేయాలని, పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు, ఆమె సానుకులంగా స్పందించారని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ కార్యదర్శి నాగులు, వైస్ సర్పంచ్ అర్జున్ తదితరులున్నారు.

సాయంకాలం.. చదువుల తీరం!

- విశాఖలోని 'గైస్'లో డిప్లమో కోర్సులకు అవకాశం
- మరోరెండు ప్రయివేటు కాలేజీలకూ సాయంకాలం కోర్సులకు అనుమతి
- పదోన్నతులు పొందాలనుకున్న వారికి అరుదైన అవకాశం



కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(కంచరపాలెం)

మురళీనగర్(విశాఖ ఉత్తర) : పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారు పదోన్నతులు పొందేందుకు గాను తమ విద్యార్హతలను పెంచుకునే అవకాశం లభిస్తే.. భలే ఉంటుంది కదూ. డిప్లమో కోర్సులను సాయం కాలం చదివే అరుదైన అవకాశం విశాఖ నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇనిస్టిట్యూట్(గైస్) అందిస్తోంది. రాష్ట్రంలో 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా సాయంకాలం కోర్సులు నిర్వహణకు విశాఖలోని గైస్‌ను ఏఐసీటీఈ ఎంపిక చేయడం విశేషం. అలాగే మరో రెండు ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలలు.. బెహరా(నరవ), ప్రశాంతి(అచ్యుతాపురం)లలోనూ సాయంత్రం కోర్సుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతిచ్చింది.

వచ్చే నెల ఒకటి నుంచి తరగతులు

కెమికల్ ఇంజనీరింగ్, పెట్రో కెమికల్స్, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగాల్లో వర్కింగ్ ప్రొఫెషనల్స్‌గా 2024–25 విద్యా సంవత్సరంలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు కోర్సులను నవంబర్ 1న ప్రారంభిస్తారు. ప్రతి కోర్సులోనూ 33 సీట్లుండగా.. వీటిలో 3 ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి ఉంటాయి. వీరు ఈ నెల 21 నుంచి 26వ వరకు సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే బెహరా పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ (అచ్యుతాపురం)లో సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.

అర్హత

గుర్తింపు పొందిన పరిశ్రమల్లో, లేదా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంటర్ ఎంపీసీ/ బైపీసీ/ఐవీసీ/లేదా ఐటీఐ సర్టిఫికెట్‌తో కెమికల్ ప్లాంట్ మెయింటెనెన్స్ మెకానిక్/అటెండెంట్ ఆపరేటర్, లేబొరేటరీ అసిస్టెంట్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర విభాగాల్లో కనీసం ఏడాది రెగ్యులర్ ఉద్యోగిగా పని చేస్తూ.. పై మూడు కళాశాలకు 50 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తి గలవారు ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 30న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

టైమింగ్స్:

రోజూ సాయంత్రం 6.30 నుంచి 9 గంటల వరకు, ఆదివారం, సెలవు దినాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకూ తరగతులు నిర్వహిస్తారు.

ఫీజు వివరాలు: సెమిస్టర్‌కు రూ.18 వేలు

ఇదొక సదావకాశం



సాయంకాలం కోర్సుల్లో చేరడం గొప్ప సదావకాశంగా భావించాలి. పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్నవారు ఈ కోర్సుల్లో చేరి పదోన్నతులు పొందొచ్చు. ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీల్లో గైస్‌కు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.

– డాక్టర్ కె.వెంకటరమణ, ప్రిన్సిపాల్, గైస్, కంచరపాలెం